క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షి తాయిని విశాఖపట్నం మౌనానంద తపోవన సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి రామానంద భారతి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఈఓ శ్రీనివాసులురెడ్డి ఆహ్వానించారు. అమ్మవారి దర్శనానంతరం సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు: ఆదూరుపల్లి 132/33 కేవీ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా 33/11 కేవీలోని పొదలకూరు, ప్రభగిరిపట్నం, వనంతోపు, తాటిపర్తి సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో శని, ఆదివారాల్లో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా చేసే విద్యుత్‌లో అంతరాయం కలుగుతుందన్నారు. రైతులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

అన్నమయ్య సంకీర్తన విభావరి రేపు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో అన్నమయ్య సంకీర్తన విభావరిని ఆదివారం సాయంత్రం ఆరుకు నిర్వహించనున్నామని నిర్వాహకులు లక్ష్మీప్రసన్న, రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతాభిమానులు, కళాకారులు హాజరుకావాలని కోరారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త, అత్తింటివారిపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జెండావీధికి చెందిన లియాకు చెన్నైకు చెందిన పర్వేజ్‌తో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకుల కింద రూ.ఏడు లక్షల నగదు, 25 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.మూడు లక్షల విలువజేసే గృహోపకరణాలను లియా కుటుంబసభ్యులు ఇచ్చారు. వివాహానంతరం కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం వేధించసాగారు. వీటిని తాళలేక పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డెర వృత్తిదారుల సంఘ మహాసభ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘ ప్రథమ మహాసభను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నామని సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై చర్చించనున్నామని, కార్యక్రమానికి తరలి రావాలని కోరారు.

19న యోగా మహోత్సవం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో యోగా మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని నయోగో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు యజ్ఞేష్‌సింగ్ పేర్కొన్నారు. నగరంలోని పెంచలమ్మ ఆస్పత్రిలో పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. డాక్టర్లు స్వప్న, ఉదయ్‌శంకర్, యోగా గురువులు ప్రసన్నకుమార్, కోటేశ్వరరెడ్డి, రవీంద్ర, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి జయంత్యుత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేట అరుణాచలంవీధిలోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం తెలిపారు. స్టోన్‌హౌస్‌పేటలోని నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. నేతలు మెంటా వీరబ్రహ్మం గుప్తా, భవనాశి సురేష్‌బాబు, దరిశి హరికృష్ణ, ఆంజనేయులు, తోట సత్యనారాయణ, సోమిశెట్టి వెంకటరమేష్,, జొన్నలగడ్డ మోహన్‌రావు, దగ్గుపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

5న ఏపీజీఈఏ రాష్ట్ర మహాసభ

నెల్లూరు (పొగతోట): ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ మహాసభను విజయవాడలో జూన్ ఐదున నిర్వహించనున్నారని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఉద్యోగులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నేతలు చింగీషా, కిరణ్‌కుమార్, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన పల్లె ప్రగతి

మడమనూరులో..



- సచివాలయాల నిర్మాణాలను వదిలేసిన కూటమి ప్రభుత్వం
- పూర్తి చేయాలని కోరుతున్న జనం

మనుబోలు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఊరూరా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు), వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణాలు చేపట్టింది. మండలంలో 14 సచివాలయాలకు గానూ 7 నిర్మాణాలు నాడు పూర్తై ప్రారంభోత్సవాలు కూడా జరిగాయి. వివిధ కారణాలతో కొన్ని నిర్మాణాలు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోవడం మానేయడంతో ఆయా గ్రామాల్లో సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలకు సొంత భవనాల్లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఎక్కడంటే..

మనుబోలు – 1, మనుబోలు – 2, చెర్లోపల్లి, వీరంపల్లి, అక్కంపేట, వెంకన్నపాళెం, పిడూరు గ్రామాల సచివాలయాల నిర్మాణాలు నాడు పూర్తి చేశారు. మడమనూరు, చెరుకుమూడి సచివాలయాలైతే రెండు ఫ్లోర్‌లు స్లాబు లెవల్ వరకూ వచ్చి ఆగిపోయాయి. వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణ దశలో ఆగిన చెరుకుమూడి సచివాలయం

అద్దె భవనాల్లోనే..



మడమనూరులో పంచాయతీకి సొంత భవనం లేదు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయం కోసం రెండతస్తుల భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. రూఫ్ లెవల్ వరకూ వచ్చి ఆగిపోయింది. దీంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

– కె.జనార్దనరెడ్డి, మడమనూరు

ఆదేశాలు అందితే..

మండలంలో 7 సచివాలయాల పరిధిలో సచివాలయాలు, ఇతర భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఫినిషింగ్ స్టేజ్‌లో ఉన్న వాటి వివరాలు అడగ్గా మడమనూరు, చెరుకుమూడి సచివాలయాల వివరాలు పంపించాం. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– రాజశేఖర్, పీఆర్ ఏఈ

సచివాలయం లేక ఇక్కట్లు



మా గ్రామంలో సచివాలయానికి సొంత భవనం లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ భవనంలోనే సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఆగిపోయిన నిర్మాణాన్ని కొత్త ప్రభుత్వం ఎప్పుడు మొదలు పెడుతుందో అర్థం కావడం లేదు. త్వరితగతిన నిధులు కేటాయించాలి.

– ఆవుల తులసీరామ్, ఉప సర్పంచ్, జట్ల కొండూరు

వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభం నేడు

కోవూరు: పట్టణంలోని పాటూరు రోడ్డులో గల రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించనున్నామని పార్టీ మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

లేఅవుట్ స్థలంపై స్టేటస్ కో

పొదలకూరు: పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్లో ఉన్న 286 అంకణాల రిజర్వు స్థలంపై గూడూరు కోర్టు స్టేటస్ కో ఇచ్చినట్టు ఎంపీడీఓ డీవీ నరసింహారావు శుక్రవారం తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం వేసిన లేఅవుట్లో ప్రజాప్రయోజనాల కోసం స్థలాన్ని కేటాయించారు. అయితే స్థలంపై వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ స్థలం క్రయ, విక్రయాలు జరిగాయని లేఅవుట్లో ఉన్న వారు ఇటీవల కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సైతం స్థలాన్ని పరిశీలించారు. అయితే స్థలంపై మలిశెట్టి శివశంకర్ గూడూరు కోర్టును ఆశ్రయించడంతో జూన్ 19వ తేదీ వరకు స్థలాన్ని యథాతథ పరిస్థితిను కొనసాగించాల్సిందిగా స్టేటస్ కో ఇచ్చినట్టు ఎంపీడీఓ వెల్లడించారు.

డెంగీపై అప్రమత్తత అవసరం



కొడవలూరులో అవగాహన ర్యాలీ



పొదలకూరులో..

కొడవలూరు: డెంగీపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి బాలచంద్రబాబు సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొడవలూరులో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఎస్‌యూఓ నాగరాజు, సీహెచ్‌ఓ సోమశేఖర్, స్టాఫ్ నర్సు వెన్నెల, హెచ్‌ఏ షఫీవుద్దీన్, ఎల్టీ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

- **పొదలకూరు:** పట్టణంలో ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కిరణ్ రిషిత, కావ్యశ్రీ మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు మస్తాన్‌బీ, ఆరోగ్య సహాయకులు కామాక్షమ్మ, రాధాకుమారి, శివప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కుష్టును నయం చేయొచ్చు



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

ఇందుకూరుపేట: వైద్యం పొందడం ద్వారా కుష్టు వ్యాధిని నయం చేయొచ్చని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో గిరిజన బాలికకు వ్యాధి సోకిందనే అనుమానంతో క్షేత్రస్థాయి పరిశీలనను శుక్రవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. వ్యాధి సోకిన చిన్నారి, కుటుంబసభ్యులు సంచారులు రావడంతో ఇంట్లో లేరన్నారు. వారెక్కడున్నారో గుర్తించి తగిన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. డాక్టర్ విజయకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను నిర్వాహక కమిటీ అధ్యక్షుడు పెండ్యాల రమణయ్య నాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కొమ్మి వేణుగోపాల్, శేఖర్, రాజగోపాల్‌రెడ్డి, ప్రసాద్, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధన చేయాలి



యోగా చేస్తున్న విద్యార్థులు

వెంకటాచలం: మారుతున్న జీవన విధానంలో ప్రతి విద్యార్థి యోగాను అలవాటు చేసుకోవాలని ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ డి.కరంచంద్ సూచించారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతీనగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. నెల్లూరు రెడ్‌క్రాస్ వారు మానవదేహం, గుండె సమస్యలు, రక్తదాన ఆవశ్యకత, రక్త వర్గీకరణ అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేజర్ రాజేష్ కుమార్, హేమంత్ కుమార్, క్యాంపు అధికారి బాలబ్రహ్మచారి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు చంద్రశేఖర్ రావు, భాస్కర్‌రావు, నాగరాజు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో దొంగతనం

- రూ.50 వేల నగదు, బంగారం అపహరణ

పొదలకూరు: పట్టణంలోని రాపూరు రోడ్డులో నివాసముంటున్న షేక్ మస్తాన్ అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. మస్తాన్ కుటుంబ సభ్యులు గురువారం రాత్రి భోజనం చేసి ఇంటికి తాళం వేసి బయట నిద్రించారు. దొంగలు తాళం పగులగొట్టి లోనికెళ్లి బీరువాను తెరిచి రూ.50 వేలు నగదు, 8 గ్రాముల బంగారు వస్తువులను అపహరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌చార్జి ఎస్సై రాకేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



బీరువాలో చిందరవందరగా వస్తువులు

చెన్నకేశవస్వామి దేవస్థానంలో పూజలు

విడవలూరు: మండలంలోని గాదెలదిన్నెలో గల దళితవాడలో కొలువైన చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి గ్రామస్తులతో ముచ్చటించారు.

ఈసీ సభ్యులకు శిక్షణ

వెంకటాచలం: వెంకటాచలంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఈసీ సభ్యులు, వీఓఏలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజుకుమారి, ఎంపీడీఓ కల్పన, ఐబి డీపీఎం కామాక్షి, ఏరియా కో–ఆర్డినేటర్ మధుసూదన్, వెలుగు ఏపీఎం రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్ చోరీ

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాసపురం వీధిలో ఆర్.పెంచలరెడ్డి తన కిరాణా దుకాణం ముందు గురువారం రాత్రి మోటార్‌బైక్ నిలిపి ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పెంచలరెడ్డి తన సోదరుడు మండలంలోని ఆర్‌వైపాళెం గ్రామంలో నివాసముంటున్న నారాయణరెడ్డికి చెందిన హీరో ప్యాషన్ ప్రో బైక్‌ను కొంతకాలంగా వినియోగిస్తున్నాడు. ఈ క్రమంలో దుకాణం ముందు నిలిపి ఉండగా దొంగలు చోరీ చేశారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు.

కాలువపై మెష్ ఏర్పాటు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని గుడిపల్లి కాలువపై ఇనుప రాడ్లు, మెష్‌తో రక్షణను శుక్రవారం ఏర్పాటు చేశారు. కాలువను కమిషనర్ బాలకృష్ణ తదితరులు పరిశీలించారు. కాలువకు రక్షణ లేకపోవడంతో అందులో చిన్నారులు పడిపోయిన ఘటనలు గతంలో జరిగాయని, ఈ క్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో రాడ్లు, మెష్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

సీపీఐ నాయకుడికి పరామర్శ

ముత్తుకూరు(పొదలకూరు): సర్వేపల్లి నియోజకవర్గ సీపీఐ కన్వీనర్ కోమారి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య శుక్రవారం పరామర్శించారు. ముత్తుకూరులోని మధురానగర్‌కు విచ్చేసి కోమారి ఆరోగ్య విషయాలు తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జిల్లా గిరిజన సంఘం కార్యదర్శి శేఖర్, మండల కార్యదర్శి తుంగ ఏడుకొండలు ఉన్నారు.

మహిళలకు ఉపాధి

మనుబోలు: ఉచిత టైలరింగ్ పథకంతో మహిళలకు ఉపాధి లభిస్తుందని ఎంపీడీఓ జలజాక్షి పేర్కొన్నారు. మండలంలోని కేంద్రం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. కుట్టుమెషీన్లు, రుణాలు ఇజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్లు మాధవి, సుధారాణి పాల్గొన్నారు.

పక్కాగా చెత్త సేకరణ

మనుబోలు: చెత్త సేకరణను పక్కాగా నిర్వహించాలని ఈఓపీఆర్డీ నారాయణ అన్నారు. మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామంలో శుక్రవారం ఇంటింటి చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వారానికి రెండు పర్యాయాలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని ఆదేశించారు. అవసరమైతే చెత్త బుట్టలు, రిక్షాలను కొనుగోలు చేసి అందజేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులను చెల్లించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రసన్న పరామర్శ



విడవలూరు: మండలంలోని వరిణి సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున్ తల్లి అనారోగ్యంతో బాధపడుతుండటంతో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వరిణిలోని వారి నివాసానికెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, పార్టీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సన్మానం



పొదలకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను స్థానిక సాయిబాబా మందిరంలో సన్మానించామని షిర్డీ సేవా సమితి వారు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, నాగిశెట్టి దామోదర్‌రావు, సభ్యులు లక్కాకుల ఆనంద్‌రావు, తుమ్మల శ్రీనివాసులు, పంగులూరు సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశలో రక్తహీనతపై అవగాహన



కొడవలూరు: గండవరం గిరిజన కాలనీలో..



కొడవలూరు: తాటాకులదిన్నెలో..

కొడవలూరు: కౌమార దశలో రక్తహీనత తలెత్తకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా గండవరం గిరిజన కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ మాట్లాడారు. పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

- దక్షిణ గండవరం తాటాకులదిన్నెలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతకు గురికారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ అన్నారు. మండలంలోని నేదురుమల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం – వేసవి శిక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తహీనత నుంచి బయటపడాలంటే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో వీఓఏ సునీత, పొదుపు లీడర్లు కన్యాకుమారి, ధనమ్మ, అంగన్‌వాడీ టీచర్లు నర్మద, నాగలక్ష్మీకుమారి పాల్గొన్నారు.

- **తోటపల్లిగూడూరు:** బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక కోరారు. మండలంలోని కొలిదిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే సువర్ణ, ఏఎన్‌ఎం సుశీల ఖాజాబీ, మంజుల, హరికుమారి, సుభాషిణి, కామాక్షి పాల్గొన్నారు.



పొదలకూరు: పోస్టర్లను ప్రదర్శిస్తున్న సూపర్‌వైజర్ తదితరులు



టీపీగూడూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక